విలేకరులు కావలెను

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell: 9247819181
8309605189

TITLE Code TEL TEL12230

# మన వార్త

ప్రజాగళానికి అక్షర రూపం

MANA VAARTHA



హైదరాబాద్,కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల,వరంగల్ శనివారం 26 ఏప్రిల్ 2025 పేజీలు : 5 వెల : 2.00

### హంతకులు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని

## హెచ్చరించిన ప్రధాని నరేంద్ర మోదీ



జమ్మూ కాశ్మీర్లో అమాయకుల ప్రాణాలు బలి తీసుకున్న ఉగ్రవాదులను వదులబోమని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.ముష్కరులకు, ఉగ్రవాదానికి మద్దతిస్తున్న వారికి కలలో కూడా ఊహించని విధంగా కఠిన శిక్ష విధిస్తామన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా బిహార్‌లోని మధుబనిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడిని ప్రస్తావిస్తూ హంతకులు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రసంగం ఆరంభంలో పహల్గాం మృతులకు ప్రధాని నివాళులర్పించారు. అనంతరం ప్రధాని ప్రసంగిస్తూ..."ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు దేశమంతా అండగా ఉంది. ఉగ్రదాడి కారణంగా ఓ తల్లి కుమారుడిని కోల్పోయింది. ఓ సోదరికి జీవిత భాగస్వామి దూరమయ్యాడు. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతిఒక్కరిలోనూ బాధ, ఆగ్రహం ఉన్నాయి. ఇది కేవలం పర్యాటకులపై జరిగిన దాడి మాత్రమే కాదు.. భారత ఆత్మపై దాడి చేసేందుకు శత్రువులు చేసిన దుస్సాహసం" అని పేర్కొన్నారు. 'ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉంది. ఉగ్రమూకల వెన్నెముకను 140 కోట్ల మంది ప్రజలు విరిచేస్తారు" అని ప్రధాని గట్టిగా హెచ్చరించారు. భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని కృతజ్ఞతలు తెలియజేశారు. "మానవత్వాన్ని విశ్వసించే ప్రతిఒక్కరూ అండగా నిలిచారు. వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నా" అని మోదీ స్పష్టం చేశారు.ప్రపంచానికి సూటి సందేశం ప్రధాని మోదీ సాధారణంగా హిందీలో ప్రసంగిస్తుంటారు. మధుబని సభలో మాత్రం అరుదైన రీతిలో ఒక్కసారిగా తన ప్రసంగాన్ని హిందీ నుంచి ఆంగ్లంలోకి మార్చారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తన సందేశాన్ని ప్రపంచ దేశాలకు సూటిగా చేరవేసేందుకు ఆంగ్లంలో ప్రసంగించినట్లు తెలుస్తోంది. "ఈ రోజు బిహార్ గడ్డ నుంచి యావత్ ప్రపంచానికి ఒక విషయం స్పష్టం చేస్తున్నా. ఉగ్రవాదులను, వారికి అండగా నిలిచేవారిని భూమిపై ఎక్కడున్నా సరే వెంటాడుతాం. వారిని శిక్షించకుండా వదిలిపెట్టబోం" అని ప్రధాని మోదీ ఆంగ్లంలో పేర్కొన్నారు.


## భూ సమస్యల సత్వర పరిష్కారానికే భూభారతి చట్టం



నిర్ణీత గడువులోగా రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకొచ్చినట్లు కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. శుక్రవారం జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం, ఇల్లందకుంట రైతు వేదికల్లో ఏర్పాటుచేసిన భూభారతి చట్టంపై అవగాహన సదస్సుల్లో కలెక్టర్ మాట్లాడారు. ధరణి చట్టంలో నిబంధనలు సరిగా లేకపోవడంతో తమ భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రైతులు కోర్టుల చుట్టూ తిరిగే వారన్నారు.కేవలం కలెక్టర్ కే బాధ్యతలు అప్పగించడంతో పని భారం పెరిగి దరఖాస్తులు పరిష్కరించలేకపోయామని అన్నారు.ధరణి చట్టంలో ఉన్న 33 మాడ్యూల్స్ లో తమ సమస్య ఏం మాడ్యూల్ లోకి వస్తుందో తెలియక ఎలా ఫిర్యాదు చేయాలో తెలియక రైతులు ఇబ్బంది పడేవారని పేర్కొన్నారు. భూభారతి చట్టంలో తహసిల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కు అధికారాలు ఇవ్వడంతో రైతుల సమస్యలు సులువుగా పరిష్కారం అవుతాయని వివరించారు.కొత్త చట్టంలో మనిషికి ఆధార్ మాదిరి భూమికి భూదార్ సంఖ్య కేటాయించినట్లు తెలిపారు. దీంతో భూ ఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుందన్నారు. న్యాయ నిపుణులు, రెవెన్యూ ఉన్నతాధికారులు, రైతు సంఘం నాయకులతో సమావేశం నిర్వహించి భూభారతి చట్టం రూపొందించారన్నారు.గతంలో దరఖాస్తులను పరిష్కరించే అధికారం కలెక్టర్ కు మాత్రమే ఉండేదని ఇటీవల ప్రభుత్వం డెలిగేషన్ ఆఫ్ పవర్స్ తీసేసి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించే అధికారం తహసిల్దార్, ఆర్డిఓ లకు అప్పగించిందన్నారు. దీంతో జిల్లాలో ఉన్న భూ సమస్యలు 11 వేల నుంచి రెండు వేలకు తగ్గాయని పేర్కొన్నారు. హుజురాబాద్ ఆర్డీఓ రమేష్ బాబు మాట్లాడుతూ భారతి చట్టంలో ఉన్న వివిధ సెక్షన్లను వివరించారు. ధరణి చట్టంలో తమ భూముల వివరాలను ఎవరికి కనిపించకుండా బ్లాక్ చేసే అధికారం రైతుకు ఉండేదని భూభారతి చట్టంలో బ్లాక్ చేసే అధికారం ఎత్తివేశారన్నారు. దీంతో రైతుల భూముల వివరాలు అందరికీ తెలుస్తాయని వివరించారు. మోకాపై వివాదాలు ఎత్తకుండా చట్టంలో పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ సదస్సుల్లో జమ్మికుంట తహసీల్దార్ రమేష్ బాబు, ఇల్లందకుంట తహసీల్దార్ రాణి, అధికారులు, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

### పహల్గామ్‌లో ఉగ్రదాడి తర్వాత

## రష్యా కీలక నిర్ణయం



కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ దాడి తర్వాత రష్యా, పాకిస్థాన్ విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది.పాకిస్తాన్‌లోని రష్యన్ రాయబార కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. రష్యన్ పౌరులు పాకిస్థాన్‌కు రావొద్దంటూ కోరింది. పహల్గామ్ ఉగ్రవాద దాడి నేపథ్యంలో ఈ ప్రకటన జారీ చేసింది. "పాకిస్తాన్-భారత్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రష్యన్ పౌరులు తాత్కాలికంగా పాకిస్తాన్‌ను సందర్శించకుండా ఉండాలని మేం సిఫార్సు చేస్తున్నాం." అంటూ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.అంతకుముందు, పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అధ్యక్షుడు ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీకి సంతాప సందేశాన్ని పంపారు. ఉగ్రవాదపు అన్ని రూపాలు, వ్యక్తీకరణలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో భారత్‌తో పరస్పర చర్యను మరింత వేగవంతం చేయడానికి సంసిద్ధంగా ఉన్నామంటూ పుతిన్ పేర్కొన్నారు. అలాగే పహల్గామ్‌లో జరిగిన క్రూరమైన నేరాన్ని సమర్థించలేం. దాడికి పాల్పడిన వారు తగిన శిక్షను పొందుతారని మేం విశ్వసిస్తున్నాం అని అన్నారు. మరోవైపు పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత భారత్, పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే భారత్, పాక్‌పై అనేక చర్యలు తీసుకుంది. పాకిస్తాన్ దేశస్థులకు సార్క్ వీసాలను నిలిపివేసింది, అటారీ బార్డర్ వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ ను మూసివేసింది. సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు కూడా ప్రకటించింది. అలాగే పాకిస్తాన్ తన గగనతలాన్ని అన్ని భారతీయ విమానయాన సంస్థలకు అడ్డుకోవడం ద్వారా ప్రతిస్పందించింది. వాఘా సరిహద్దును కూడా మూసివేసి, భారతదేశంతో అన్ని వాణిజ్యాలను నిలిపివేసింది. మరో ముఖ్యమైన నిర్ణయం సిమ్లా ఒప్పందాన్ని నిలిపివేసింది.

### ఉగ్రవాదం అంతమొందించేందుకు కేంద్ర ప్రభుత్వం

### తీసుకున్న ప్రతి నిర్ణయానికి మద్దతిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి





హైదరాబాద్ లోని పీపుల్స్ ప్లాజానుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు పహల్గాం ఉగ్రదాడిలో చనిపోయిన మృతులకు నివాళులర్పిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రవాదం అంతమొందించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయానికి మద్దతిస్తామని తెలిపారు.ఏ ఐ సి సి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఎంపీలు,ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు, మహిళ కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇందిరాగాంధీ విగ్రహం దగ్గర పహల్గాం మృతులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘీభావంగా ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ, భారత్ సమ్మిట్ లో పాల్గొనేందుకు వచ్చిన విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA
epaper
చదవడానికి QR కోడ్‌ను స్కాన్ చేయండి
http://manavaartha.net
MANA VAARTHA

### సింధూ నది నుంచి ఒక్క చుక్క నీరు కూడా పాక్‌కు

### వెళ్లకుండా భారత్ వ్యూహాత్మకంగా అడుగులు



దాడితో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఈ క్రమంలోనే పాక్‌తో సింధూ నదీ జలాల ఒప్పందం అమలును తక్షణమే నిలిపివేస్తున్నట్లు భారత్ ప్రకటించింది. అంతేకాదు.. సింధూ నది నుంచి ఒక్క చుక్క నీరు కూడా పాక్?కు వెళ్లకుండా భారత్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. సింధూ నదీజలాలపై ఢిల్లీ వేదికగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కీలక సమావేశం నిర్వహించారు.జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, ఉన్నతాధికారులతో అమిత్ షా భేటీ అయ్యారు. 1960లో వరల్డ్ బ్యాంక్ మధ్యవర్తిత్వంతో భారత్- పాకిస్తాన్ మధ్య సింధూ జలాల ఒప్పందం గురించి చర్చించారు. మూడు దశల్లో సింధూ జలాలు పాక్?కు దక్కకుండా ప్లాన్ చేశారు. మొదట ప్రపంచ బ్యాంక్?కు మన వైఖరి తెలియజేయాలని నిర్ణయించారు. కాగా, సింధూ, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్ , పాకిస్థాన్‌ల మధ్య గతంలో ఒప్పందం కుదిరింది. దీనికి అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ సంతకం చేశారు. ఈ క్రమంలోనే ముందుగా ప్రపంచ బ్యాంక్?కు భారత్ వైఖరిని తెలియజేయాలని నిర్ణయించారు.

# సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**జహీరాబాద్, ఏప్రిల్ 25 (మన వార్తా):** సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించే సందర్భంగా జహీరాబాద్ ఎమ్మెల్యే కె మాణిక్ రావు హిందూ సాంప్రదాయం ప్రకారం పూజ కార్యక్రమం నిర్వహించారు. జహీరాబాద్ మండలం రాయిపల్లి డి లో 5 లక్షల రూపాయలతో, హెూతీ బి లో 5 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, నాయకులు మచ్చెందర్, పర్వేజ్, చిన్న రెడ్డి, విజయ్, రాములు, గోవర్దన్ రెడ్డి, శంకర్, రాథోడ్ భీమ్ రావు నాయక్, మోహన్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై ధాన్యాన్ని పోయవద్దు




**-నిర్లక్ష్యంగా రోడ్లపై ధాన్యం పోసి అమాయక ప్రజల ప్రాణాలు పోవడానికి కారణం కావొద్దన్నారుం....**

**-గజ్వేల్ సిఐ బి సైదా....**

**గజ్వేల్ ఏప్రిల్ 25 (మన వార్త ప్రతినిధి జీ మురళి)**

రోడ్ల పై ధాన్యం కుప్పలు ఉండడం వల్ల ప్రమాదాలు జరిగి ఎంతో మంది చనిపోతున్నారని, సాధ్యమైనంత వరకు రైతులు రోడ్ల పై ధాన్యం పోయారాదని గజ్వేల్ సిఐ బి సైదా సూచించారు శుక్రవారం గజ్వేల్ సిఐ బి సైదామీడియాతో మాట్లాడుతూ రోడ్లపై ధాన్యం పోయడం వల్ల వాహనదారులు, మోటార్ సైకిల్ వాహనదారులు రాత్రి సమయాలలో అది గమనించక కొంతమంది గాయాలపాలు కావడం, ప్రమాదం జరిగి చనిపోతున్నారని, బావి దగ్గర ఇండ్ల వద్ద లేదా ఇతర ప్రదేశాలలో ధాన్యం పోయడానికి ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా రోడ్లపై ధాన్యం పోసి అమాయక ప్రజల ప్రాణాలు పోవడానికి కారణం కావొద్దన్నారు. రోడ్లపై ధాన్యం పోసి రాత్రి సమయంలో నల్ల కవర్ కప్పి చుట్టూ రాళ్లు పెట్టడం వల్ల అది గమనించని మోటార్ సైకిల్ వాహనదారులు అవి తగిలి చనిపోవడం జరుగుతుందని, ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి రైతుకు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని సూచించారు

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**-చిన్న శంకరం పేట...**

**(మన వార్తా ప్రతినిధి నరేందర్)ఏప్రిల్ 25**

గ్రామీణ ప్రాంతాల్లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ముమ్మరంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగం శ్రీనివాస్ రావు తెలిపారు, చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మేడ్చల్ మేడిసిటీ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు, మేడ్చల్ మెడిసిటీ ఆసుపత్రి సిబ్బందితోపాటు చిన్న శంకరంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్య శిబిరంలో 150 మంది కి వైద్య పరీక్షలు నిర్వహించారు, కంటి, బీపీ, షుగర్, థైరాయిడ్, వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు, ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు, జిల్లా చైర్మన్ రాజశేఖర్ రెడ్డి, మేనేజ్మెంట్ కమిటీ సభ్యుడు దేమేయాదగిరి, మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, నిర్వహించడం జరుగుతుందని గ్రామీణ ప్రాంతాల్లో ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తే పేద ప్రజలకు ఎంతో మేలుగా ఉంటుందని ఉద్దేశంతో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోనే ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద ప్రజలు ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు ఆపరేషన్లు అవసరం ఉన్నవారికి సైతం ఉచితంగానే ఆపరేషన్ నిర్వహించి ఉచిత మందులతో పాటు వారిని ఆసుపత్రికి తీసుకువెళ్లి మళ్లీ ఇంటికి తీసుకువచ్చే విధంగా బాధ్యతలు చేపడతామని వారు అన్నారు, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశాల మేరకు చిన్న శంకరంపేట మండల కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు ఈ కార్యక్రమంలో మెడిసిటీ ఆసుపత్రి వైద్యులు ప్రవళిక, దీక్షిత, సుప్రియ, సౌజన్య, తో పాటు రెడ్ క్రాస్ సొసైటీ మెదక్ జిల్లా చైర్మన్ రాజశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, రాష్ట్ర ఎంసీ నెంబర్ సింగం శ్రీనివాసరావు, కార్యదర్శి సుభాష్ చంద్రబోస్, కోశాధికారి శ్రీనివాస్ శర్మ, మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు దేమే యాదగిరి,మద్దెల సత్యనారాయణ, తోట శ్రీనివాస్, చిన్న శంకరంలో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది డాక్టర్ హృదయ్, ఎమ్మెల్హెచ్పి లు కుమారి, నందిని, హెల్త్ సూపర్వైజర్ బుజ్జి, ఏఎన్ఎంలు మాధవి, మాల, తదితరులు పాల్గొన్నారు

## ఫహల్గాం ఘటనను ఖండిస్తూ నిరసన దీక్ష చేపట్టిన జిల్లా కాంగ్రెస్ నాయకులు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 25 (మన వార్తా ప్రతినిధి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.కొత్తగూడెంలోజమ్ము కాశ్మీర్ లోనీ. పహల్గ మ్. ప్రాంతంలో పర్యాటకుల పై ఉగ్రవాదులు జరిపినమరణహెూమాన్నిఖండిస్తూ.కొత్తగూడెం, సూపర్ బజార్ సెంటర్లో మృతి చెందిన అందరి చిత్రపటాలకు నివాళులు అర్పించి, ఒకరోజు నిరసన దీక్ష చేపట్టిన పౌర సమాజం నాయకులు. అనంతరం నాయకులు మాట్లాడుతూ జమ్ము కాశ్మీర్లో మన భారత దేశ హిందూ మత కులస్తులను అడిగి కాల్చి చంపిన పుష్కరలను వెంటనే ఉరితీయాలని అమాయక ప్రజలను బలికొన్నారని తెలిపారు మృతి చెందిన వారికి నాయకులు పూలు వేసి నివాళులర్పించారు టెర్రరిస్టర్ లు నశించాలి అంటూ దీక్ష శిబిరం లో ప్రతి ఒక్కరూ ఎలుగెత్తి చాటారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.అల్లం మురళి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు.శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నాగ సీతారాములు టి పి సి సి సభ్యులు.చీకటి కార్తీక్ యువజన కాంగ్రెస్ నాయకులుజిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు దేవి ప్రసన్నజేబీఎస్ చౌదరి జిల్లా కాంగ్రెస్ నాయకులుజిల్లా కాంగ్రెస్ మసూద్.కాంగ్రెస్ సీఎం నాయకురాలు లక్ష్మి.ఓకే రాంబాబు నాయక్ఏఎంసి చైర్మన్ మాలోతు శివ నాయక్ చుంచుపల్లి యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ఆజమేరా మంగీలాల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు.మల్లెల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్లో నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేయండి



**-మాజీ ఎమ్మెల్యే బి ఆర్ ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి...**

**-నిజాంపేట...**

**(మన వార్తా ప్రతినిధి నరేందర్) ఏప్రిల్ 25**

ఈనెల 27న వరంగల్ లో జరిగే బిఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ కంఠా రెడ్డి తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు నిజాంపేట మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2001లో గులాబీ జెండాను పట్టుకుని వెళ్ళిన కేసీఆర్ 14 ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో ఢిల్లీ నాయకుల మెడలో వంచి ఎంతోమంది అమరవీరుల త్యాగఫలంతో తెలంగాణ రాష్ట్రానికి సాధించుకున్నామన్నారు.దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిన ఘనత కెసిఆర్ కి దక్కుతుందన్నారు. మొన్న జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనలో తెలంగాణ ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ యాడాదిన్నర పాలనలోనే ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందన్నారు. తెలంగాణలో మరొకసారి కెసిఆర్ ని మళ్లీ ముఖ్యమంత్రి గా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు కెసిఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే పోలీసులు పట్టించుకోవడం దారుణమన్నారు.అభివృద్ధిపై ప్రశ్నిస్తే బిఆర్ఎస్ పార్టీ నాయకులను అరెస్టులు చేయడం ఖండిస్తున్నామన్నారు. అధికార పార్టీకే అధికారులు మొగ్గు చూపడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు నాగరాజు, మాజీ సర్పంచ్ సంగుస్వామి,అరుణ్ కుమార్,తిరుమల గౌడ్, దయాకర్, మాజీ కో ఆప్షన్ గౌస్,రంజిత్ గౌడ్, దుబ్బ రాజా గౌడ్, పున్న వెంకటస్వామి, లక్ష్మీ నర్సింలు, రాములు గౌడ్, గోపరి నర్సింలు, మావురం రాజు,నగేష్,బాల్ రెడ్డి,మైపాల్, పెంటయ్య, కైలాస్,వెంకట్ గౌడ్, మాధవరెడ్డి, కొమురయ్య, కనకరాజు,తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ ఆస్తుల సంరక్షణకే వక్ఫ్ సవరణ బిల్లు



**మల్యాల.ఏప్రిల్ 25.మన వార్త ప్రతినిధి. కుందారపు రమేష్**

ధార్మిక కార్యక్రమాలకు, సేవా కార్యక్రమాలకు దాతలు దానం చేసిన ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా చూడడం, దాతల యొక్క ఉద్దేశం సక్రమంగా నెరవేరేలా వక్ఫ్ ఆస్తులను సంరక్షించేందుకే సవరణ బిల్లు 2025ను నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిందని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు.బిజెపి మల్యాల మండల శాఖ అధ్యక్షులు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బింగి వేణు కన్వీనర్ గా మల్యాల పట్టణంలోని మున్నూరు కాపు సంఘం భవనంలో ఏర్పాటు చేసిన వక్ఫ్ సవరణ చట్టం మండల కార్యశాలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత ధనవంతమైన సంస్థగా ఉన్న భారతీయ వక్ఫ్ బోర్డ్ అధీనంలో దేశంలోని మెట్రో నగరాలు రాష్ట్ర రాజధానులు పెద్ద పట్టణాలు జిల్లాలలో 39 లక్షల ఎకరాల భూములు ఉంటే ఒక్కో ఎకరం నికి కనీసం 500 రూపాయల ఆదాయం కూడా రాకపోవడం దాతలు సూచించినట్టుగా వృద్ధాలయాలు, వైద్యాలయాలు, విద్యాలయాలు,అల్లాహ్ ఆలయాలు , స్త్రీ సంరక్షణ లాంటి ధర్మ కార్యాలకు కాకుండా ఫైవ్ స్టార్ హెూటళ్లు , షాపింగ్ మాల్స్ లాంటి వాటికి ఉపయోగించడం వాటి నుండి కూడా నామ మాత్రపు కిరాయి తీసుకుంటూ అవినీతికి పాల్పడటం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.హైదరాబాద్ నడిబొడ్డున చార్మినార్ పక్కనే ఉన్న పత్తర్ ఘట్టీ లో వాక్స్ బోర్డు కు 900 దుకాణాల సముదాయం ఉంటే ఒక్కో దుకాణానికి ఐదు నుంచి పది లక్షల కిరాయి అక్కడి మార్కెట్లో నడుస్తూ ఉంటే వక్స్ బోర్డుకు మాత్రం 600 నుంచి ?1000 కిరాయి రావడం వక్ఫ్ బోర్డులో వేళ్లూనుకున్న అవినీతికి తార్కాణం అన్నారు.2005 - 6వ సంవత్సరంలో నాటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ రాజేందర్ సచార్ కమిటీ , జాయింట్ పార్లమెంటరీ కమిటీలు వక్స్ బోర్డుల పరిపాలనలో పారదర్శకత, రికార్డుల డిజిటలైజేషన్, ఆస్తుల సమీక్ష, ముతావలీల పరిపాలనకు మార్గదర్శకాలు,వక్ఫ్ బోర్డులో పరిపాలన అధికారులకు ముస్లింలలోని అహమ్మదీయ, మహమ్మదీయ, దావూదీ, బొహ్రా,,పాస్మండా, వంటి అన్ని వర్గాలకు మహిళలకు సముచిత స్థానం కల్పించాలని సూచించారని వాటన్నిటినీ వత్తు సవరణ చట్టంలో క్రోడీకరించిన ఘనత నరేంద్ర మోడీకి దక్కుతుందని కాంగ్రెస్ నాయకులు గమనిస్తే మంచిదని సింగిరెడ్డి కృష్ణారెడ్డి సూచించారు. మజీద్ కమిటీలు, దర్గాకమిటీలు, ఈద్గా కమిటీలు వంటి వాటిలో ప్రభుత్వ జోక్యం ఉండదని వాటిని ముస్లిం పెద్దలు బేషుగ్గా నిర్వహించుకునేలా ప్రభుత్వ రక్షణ ఉంటుందని ఇట్టి విషయంలో ఎలాంటి అపోహలకు తావు లేదని ఆయన పేర్కొన్నారు.కాంగ్రెస్ కమ్యూనిస్టు మజ్లిస్ సంస్థలు ఇంతకు ముందు సీ ఏ ఏ చట్ట సవరణ సమయంలో ముస్లింలు పౌరసత్వం కోల్పోతారని దుష్ప్రచారం చేశారని సి ఏ ఏ తో పౌరసత్వం కోల్పోయిన ఒక్క భారతీయ ముస్లింను కాంగ్రెస్ నాయకులు చూపించాలని ఆయన సవాల్ విసిరారు. అలాగే వక్ఫ్ చట్టం గురించి కూడా కాంగ్రెస్ పార్టీ అసత్య ప్రచారాన్ని ప్రజలు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో పొన్నం సాయి కుమార్ గౌడ్. సాయి కిరణ్. బొబ్బిలి వెంకటస్వామి యాదవ్. నులుగొండ సురేష్.కిల్లేటి రమేష్.కొడిదిల రాజయ్య. గడ్డం నడిపి మల్లేశం. రమ. కోన శ్రీనివాస్. పిల్లి రాజశేఖర్. మల్లేశం యాదవ్. గుండేటి గంగారం. %=%.కిషన్. నీలం రవి. తిరుపతి. సందీప్. మారుతి. ఆనందం. శ్రీధర్ గౌడ్. సంఘ శంకర్. గోవర్ధన్ రెడ్డి. చిన్న మల్లేశం. రాజకుమార్. అనంత రెడ్డి. జీవన్ రెడ్డి. రాజేశం. బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# బ్రిడ్జి నిర్మించండి మా ప్రాణాలు కాపాడండి



**-గోల్పర్తి గ్రామ రైతుల ఆందోళన...**
**-రామాయంపేట...**
**(మన వార్త ప్రతినిధి నరేందర్) ఏప్రిల్ 25మెదక్ జిల్లా**
రామాయంపేట అద్య హెటల్ బైపాస్ ఎంట్రీ వద్ద నూతనంగా బ్రిడ్జి ఏర్పాటు చేయాలంటూ మున్సిపాలిటీ పరిధిలోని గోల్పర్తి రైతులు ఆందోళన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారి 44పై రోడ్డు విస్తరణ పనులు చేపట్టి రామాయంపేట మున్సిపాలిటీ రైతుల ప్రాణాలు గతంలో రోడ్డు దాటుతున్న సమయంలో చాలామంది రైతులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు.రైతులు పంట పొలాలకు వెళ్లాలంటే మరియు ఒక రైతు చనిపోతే ఆ పంట పొలాల్లోకి రోడ్డు దాటుతూ శవాన్ని మోసుకెళ్లాలంటే చాలా ఇబ్బందులకు తాము గురవుతున్నామని పేర్కొన్నారు.ఈ విషయంలో తాము ఎన్నో మార్లు రాస్తారోకోలు చేసిన ఫలితం లేకపోయిందన్నారు.అందువల్ల జాతీయా రహదారి అధికారులు రోడ్డు విస్తరణ పనులు నిలిపివేసి పై నుండి బ్రిడ్జిని ఏర్పాటు చేసి తమకు న్యాయం చేయాలని రైతులు వేడుకుంటున్నారు.ఈ విషయం తెలుసుకున్న రామాయంపేట ఎస్సై బాలరాజ్ బైపాస్ వద్దకు వెళ్లి బాధితులతో మాట్లాడి వారికి తగిన న్యాయం చేస్తామంటూ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమింపజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ రైతులు మహిళలు పురుషులు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొండగట్టులో గుర్తుతెలియని యాచకుడి మృతి



**మల్యాల. ఏప్రిల్ 25.మన వార్త ప్రతినిధి. రమేష్**
మల్యాల మండలం కొండగట్టు దిగువన జలబుగ్గ ప్రాంతంలో భిక్షాటన చేసే గుర్తుతెలియని వ్యక్తి (75) మృతిచెందాడు. గ్రామపంచాయతీ సిబ్బంది శానిటైజేషన్ పనులు నిర్వహిస్తుండగా మృతి చెందిన వ్యక్తిని గమనించి ముత్యంపేట కారోబార్ పైడిపల్లి రాజేశ్వర్ కు సమాచారం అందించారు. దీంతో ఆయన ఎస్ఐకి తెలియపరచగా సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ నరేష్ మృతదేహన్ని పరిశీలించి, కారోబార్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# భూ వివాదరహిత రాష్ట్రం ఏర్పాటే ప్రభుత్వ లక్ష్యం




**-మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్...**
**-నార్సింగీ...**
**(మన వార్త ప్రతినిధి నరేందర్) ఏప్రిల్ 25**
భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూ భారతి - ఆర్.ఓ.ఆర్ చట్టం ఎంతో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం నార్సింగి మండల కేంద్రం లోని రైతు వేదికలో స్థానిక తహశీల్దార్ షేక్ కరీం ఆధ్వర్యంలో భూ భారతి - ఆర్.ఓ.ఆర్ చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు స్థానిక అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్, ఆర్డీఓ జయచంద్రారెడ్డి, షేక్ కరీం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ భారతి చట్టంతో రైతుల భూములకు భద్రత లభిస్తుందని, రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి నిపుణుల కమిటీతో వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేసి, పటిష్టమైన చట్టాన్ని రూపొందించి అమల్లోకి తెచ్చిందని అన్నారు. గతం లో ఉన్న ధరణి పోర్టల్ ద్వారా ప్రజలు, రైతులు అనేక సమస్యలను ఎదుర్కున్నారని, నూతన భూ భారతి చట్టం ద్వారా ఆ సమస్యలు సులభంగా పరిష్కరించ వచ్చని తెలిపారు. ఈ చట్టంలో భూ సమస్యలపై రైతులు మీ - సేవా లో దరఖాస్తు చేసుకోవచ్చని, ధరణి పోర్టల్ లో ఎలాంటి అవకాశం లేదని, సివిల్ కోర్టుకు వెళ్లాల్సి వచ్చేదని అన్నారు. భూ భారతి చట్టంలో భూ సమస్యల పై తహసీల్దార్ కు ఆపై ఆర్డీఓ, ఆర్డీఓ నుంచి కలెక్టర్, కలెక్టర్ నుంచి ల్యాండ్ ట్రిబ్యునల్ కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారని వివరించారు. ఈ చట్టం ద్వారా రికార్డుల్లో తప్పుల సవరణకు కూడా సరి చేసేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నెల 29 వరకు జిల్లా వ్యాప్తంగా భూ భారతి అవగాహన సదస్సులను పూర్తి చేస్తామని, జూన్ 2 నుంచి భూ భారతి చట్టం జిల్లా వ్యాప్తంగా అమలు లోకి వస్తుందని,ప్రభుత్వ ఆదేశానుసారం త్వరలోనే గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, రైతుల నుంచి వారి సమస్యల వివరాలను సేకరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జయచంద్ర రెడ్డి, తహసిల్దార్ షేక్ కరీం, ఎంపిడిఓ ఆనంద్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు శ్రీధర్, మేఘన, మండల సర్వేయర్ శ్రీకాంత్, ఎం.ఏ.ఒ యాదగిరి, ఎం.పీ.ఓ సయిాద్, పీ.ఏ.సీ.ఎస్ చైర్మన్ శశిధర్ రెడ్డి, ఏ.ఈ.ఓ లు విజృంభణ,దివ్య, ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్, ఐకేపీ సీసీ శంకర్, సుల్తానా వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# కాలేజీకి వెళ్లిన అమ్మాయి ఇంటికి తిరిగి రాలేదు



**జహీరాబాద్, ఏప్రిల్ 25 (మన వార్తా):** తన చెల్లెలు అయిన అయేషా ఖాతున్ కాలేజీకి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని సహెూదరుడు మహమ్మద్ రహమత్ అలీ పోలీసులకు పిర్యాదు చేశాడు. జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం మహమ్మద్ రహమత్ అలీ తండ్రి మహమ్మద్ శమీమ్ నివాసం జహీరాబాద్ అహమద్ నగర్ యొక్క సహెూదరీ అయేషా ఖతున్, తాను చదివే ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి తేదీ 23 ఏప్రిల్ 2025 ఉదయం వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అమ్మాయి కుటుంబ సభ్యులు స్నేహితులను ఆరా తీయగా కాలేజీకి మాత్రం వచ్చినట్లు తెలిపారు. ఇంత వరకు అమ్మాయి ఆచూకీ తెలియక పోయేసరికి ఇట్టి విషయమై అమ్మాయి సహెూదరుడు జహీరాబాద్ పట్టణ పట్టణ పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేసినట్లు తెలిపారు.

## శేరిలింగంపల్లి డివిజన్ లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా రూ. 2 కోట్ల 31 లక్షల రూపాయల అంచనా



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 25 (మన వార్త ప్రతినిధి)**
శేరిలింగంపల్లి డివిజన్ లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా రూ. 2 కోట్ల 31 లక్షల రూపాయల అంచనా వ్యయంతో డివిజన్ అభివృద్ధిలో భాగంగా రేపు అనగా 26-04-2025 శనివారం రోజున సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పిఏసీ ఛైర్మెన్, శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరెఖపూడి గాంధీ, సంబంధిత జిహెచ్ఎంసి అధికారులతో కలిసి శంకుస్థాపన కార్యక్రమం చేపట్టనున్న శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్. శంకుస్థాపన కార్యక్రమం వివరాలు. ఉదయం 09:30 గంటలకు పాపిరెడ్డి నగర్ లోని గాంధీ విగ్రహం వీధిలో రూ. 50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టేబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన. ఉదయం 09:45 గంటలకు పాపిరెడ్డి నగర్ లోని సబ్ స్టేషన్ రోడ్డు వద్ద రూ. 1 కోటి రూపాయల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన. ఉదయం 10:00 గంటలకు రాజీవ్ గృహకల్పలో రూ. 51 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టబోయే సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన.ఉదయం 10:15 గంటలకు మస్జీద్ బండలో రూ. 30 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన. కావున శేరిలింగంపల్లి డివిజన్ లోని సీనియర్ నాయకులు, వార్డ్ మెంబర్లు, బస్తీ కమిటీ మెంబర్స్, బూత్ కమిటీ మెంబర్స్, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ అనుబంధ సంఘ ప్రతినిధులు, శ్రేయోభిలాషులు తదితరులు సకాలంలో విచ్చేసి సీసీ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమములను విజయవంతం చేయగలరని మనవి.

# చేగుంటలో ముస్లిం సోదరుల భారీ ర్యాలీ



**-చేగుంట...**
**(మన వార్తా ప్రతినిధి నరేందర్) ఏప్రిల్ 25**
జమ్మూ కాశ్మీర్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన భారతీయుల ఆత్మకు శాంతి కలగాలని చేగుంట మండల కేంద్రంలోని ముస్లిం సోదరులు భారీ ర్యాలీ నిర్వహించారు, హిందుస్థాన్ జిందాబాద్, హిందూ ముస్లిం భాయి భాయి, భారతదేశం లోనే ఉంటామని, లష్కరే తోయిబా ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు, అనంతరం ముస్లిం సోదరులు మాట్లాడుతూ భారతీయులంతా ఒకటేనని, హిందూ ముస్లిం భాయి భాయి అని, ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన భారతీయుల ఆత్మకు శాంతి కలగాలని వారు కోరారు, భారతదేశాన్ని కాపాడుకునేందుకు ముందుంటామని ఇలాంటి దుర్మార్గమైన చర్యలకు పాల్పడ్డ వారిని పాకిస్తాన్ కానీ ఎవరైనా కానీ కఠినంగా శిక్షించాలని వారన్నారు, భారత దేశంలో అంతా కూడా అన్నదమ్ముల వల్ల కలిసి ఉండాలని హిందూ ముస్లిం అనే తేడా లేకుండా సోదర భావంతో ఉండే విధంగా చూడాలని ఆ దేవున్ని కోరుకున్నట్లు తెలిపారు, ఈ కార్యక్రమంలో షకీల్, రహీం, జలీల్, మహమ్మద్ అలీ, ఆరిఫ్, ఖలీల్, అఖిల్, జమీల్, ఖాలేద్, అజీమ్, తదితరులు పాల్గొన్నారు

# పెద్దమ్మ ఆలయంలో ఘనంగా సామూహిక కుంకుమార్చన



**నిజాంపేట**
**(మన వార్తా ప్రతినిధి నరేందర్) ఏప్రిల్ 25**
నిజాంపేట మండల కేంద్రంలో శుక్రవారం పెద్దమ్మ తల్లి ఆలయంలో ముదిరాజ్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో కుంకుమార్చన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ పురోహితులు వేలేటి లక్ష్మణ శాస్త్రి మాట్లాడుతూ లోక కళ్యాణార్థం పెద్దమ్మ ఆలయ మండపంలో గ్రామ ముత్తైదుల చేత కుంకుమార్చన కార్యక్రమం చేపట్టామన్నారు. ఆ పెద్దమ్మ తల్లి కృపతో వర్షాలు సమృద్ధిగా కురవాలని పాడిపంటలు సుభిక్షంగా పండాలని అమ్మవారిని వేడుకున్నామన్నారు ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులుపంజా బాబు,ఉపాధ్యక్షులు మాసులనాగరాజు, కోశాధికారి రెడ్డి రాకేష్,మాజీ అధ్యక్షులు జలపోచయ్య,మాసుల కర్ణాకర్,జిపిస్వామి,తమ్మలి రమేష్,పంజా నవీన్, చెంద్రం, జాల రవి, గేరిగంటి బాబు,పున్న వెంకటస్వామి,రాజు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి




**కల్వకుర్తి.ఏప్రిల్ 25మన వార్త ప్రతినిధి**
రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండల లోని వేల్జాల్ గ్రామానికి చెందిన మల్లికేడి అశోక్, తుపాకుల పవన్ , అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స చేయించుకోని హాస్పిటల్ బిల్స్ స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి కి ఇవ్వడం జరిగింది వారి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులను స్థానిక నాయకుల తో కలిసి లబ్ధిదారులు మల్లెకేడి అశోక్ , తుపాకుల పవన్, కు అందించిన ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెర్ల వెంకట్ రెడ్డిఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మల్లి కేడి అంబాజి,మాజీ ఉప సర్పంచ్ అజీజ్, మండల్ కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు, ఎం.డి. ఆరిఫ్, నాయకులు ఏ రవీందర్ గౌడ్,సి.వెంకటరమణారెడ్డి, ఏ కిరణ్ కుమార్ గౌడ్, ఎం.డి. అబ్బాస్, పులిజాల విష్ణు, ఎం.డి. అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాద మత దాడులను ఖండిస్తూ దాడిలో మృతిచెందిన కుటుంబాలకు సంతాపంగా కొడిమ్యాలలో స్వచ్ఛందగా బంద్



**కొడిమ్యాల:ఏప్రిల్ 25 (మన వార్త ప్రతినిధి శ్రీనివాస్).**
పహల్గవ్ లో పర్యటిస్తున్న పర్యాటకులను విచక్షణ రహితంగా మత ఆధారంగా కలమా చదువకపోతే అతి కిరాతకంగా చంపడం దారుణమైన చర్యఇట్టి ఉగ్రవాద చర్యను తీవ్రంగా ముక్తా కంఠంతో 140 కోట్ల హిందూస్తాన్ భారతీయులు ఖండిస్తున్నాం,అమాయక ప్రజల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదులను వారిని పెంచి పోషిస్తున్న అధిపతులను సహకరిస్తున్న వారిని వదిలి పెట్టకుండా దేశ ప్రధాని చర్యలు తీసుకోవాలని ఈ సమయంలో ప్రతి దేశ పౌరుడు పౌరురాలు అన్ని రాజకీయ పార్టీలు సంస్థలు ముందుకు రావాలి ఉగ్రవాదమును అరికట్టాలి అని స్థానిక అంగడిబజార్, గాంధీ చౌక్ నుండి బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు, తర్వాత మరణించిన వారి ఆత్మ శాంతి కొరకు రెండు నిమిషాలు మౌనం పాటించడం జరిగింది.కొడిమ్యాల మండల కేంద్రంలోని వాణిజ్య సముదాయాలు అన్ని స్వచ్ఛందంగా బందు చేశారు.ఈ కార్యక్రమంలో హిందువులు పాల్గొన్నారు.

# ఐకేపీ కొనుగోలు కేంద్రంలో గోల్ మాల్



**-క్వాంటాకొట్టి రైతులను మోసం చేస్తున్న నిర్వాహకులు.**

**-పసిగట్టి,ఆందోళనకు దిగిన రైతులు..**

**హసన్ పర్తి ఏప్రిల్ 25(మనవార్త ప్రతినిధి):**దళారుల చేతిలో రైతులు మోస పోవద్దని, రైతులకు గిట్టుబాటు ధర రావాలనే సదుద్దేశంతో ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు భాద్యత సొసైటీ, మహిళా సంఘాలకు అప్పగిస్తే ఇక్కడ వారు కూడా రైతులను మోసం చేస్తున్నారు.హసన్ పర్తి మండలంలోని జయగిరి గ్రామ సాయిబాబా గ్రామ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు 40కిలోల బస్తాకు 4కిలోలు ఎక్కువ ధాన్యం వచ్చే విదంగా క్వాంటా తక్కువ బరువుకు సర్దుబాటు చేశారు.దీన్ని పసిగట్టిన రైతులు తీరా నిర్వాహకులు క్వాంటా వేసిన ధాన్యం బస్తాను తూకం వేస్తే 4కిలోల తేడా వచ్చింది. దీంతో గ్రామ రైతులు అందరు ఆందోళన చేశారు.దీంతో సంబందిత సెర్ప్, అగ్రికల్చర్ అధికారులు వచ్చి ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రం వారు వేసిన తూకాలను లెక్క చేయగా 1క్వింటా కు 8కిలోల చొప్పున ఇప్పటి వరకు 25క్వింటాల ధాన్యం అధిక తూకంతో రూ. 92వేలు రైతులకు నష్టం జరిగింది.అధికారుల పర్యవేక్షణ లోపంతో రైతులకు నష్టం.మహిళా సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసే కేంద్రాల పర్యవేక్షణ భాద్యత మండల అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ది కాగా, సెంటర్ ఇంచార్జి భాద్యత కమ్యూనిటీ కోఆర్డినేటర్ ది.అయితే ఈ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయక, మహిళా సంఘాల నిర్వాహకులకు సరైన సలహాలు, సూచనలు ఇవ్వకనే ఈ తప్పులు దొర్లుతున్నాయని రైతులు తెలిపారు.నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు కమిటీ ఏర్పాటు ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడి మండల అధికారులు కొనుగోలు కమిటీని ఏర్పాటు చేశారు.నిబంధనలకు విరుద్ధంగా గ్రామ సంఘం ఓబి, వివోఏ లు కొనుగోలు కమిటీలో ఉండకూడదని అధికారులకు తెలిసినా కొనుగోలు కమిటీలో వివోఏ లను చేర్చారు.గ్రామ సంఘంలో చురుకైన మహిళా సభ్యురాలుకు శిక్షణ ఇచ్చి ట్యాబ్ ఆపరేటింగ్ చేయించాలి.కాని ఇక్కడ పదేండ్లుగా వివో ఓబీ, వివోఏ లే నిబంధనలకు విరుద్ధంగా కమిటీ నిర్వహణలో ఉన్నారు. ఇదంతా ఇక్కడి మండల,క్లస్టర్ ఇంచార్జి కనుసన్నల్లో నడుస్తుందని, లావాదేవీల వాటాలు పంచుకుంటున్నారని రైతులు ఆందోళన చేశారు.

# ఝరాసంఘంలో భూ భారతి చట్టం పై అవగాహన సదస్సు




**జహీరాబాద్, ఏప్రిల్ 25 (మన వార్తా):** జహీరాబాద్ నియోజకవర్గం ఝరాసంఘ మండల కేంద్రంలో భూ భారతి చట్టం పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్ రావు, సెట్విన్ ఛైర్మన్ గిరిధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్, అదనపు కలెక్టర్ మాధూరి పాల్గొని భూ సమస్యల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం తీసుకు వచ్చిన భూ భారతి చట్టం, భూముల సమస్యలను పరిష్కారానికి ఒక మంచి అవకాశమని అన్నారు. భూ భారతి చట్టాన్ని క్షేత్ర స్థాయికి సమర్థవంతంగా తీసుకెళ్లేందుకు ఈ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భూ భారతి చట్టంలో రెవెన్యూ యంత్రాంగం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి రాంరెడ్డి, ఆయా మండలాల తహశీల్దార్లు, ఎంపిడివో లు, వ్యవసాయ శాఖ అధికారులు, రాజకీయ నాయకులు రైతులు పాల్గొన్నారు.

# హిందుస్థాన్ జిందాబాద్ పాకిస్తాన్.ముర్దాబాద్ ఉగ్రవాదులను అంతమొందించాలని పిలుపు




**కల్వకుర్తి.ఏప్రిల్ 25 మన వార్తా ప్రతినిధి.** కల్వకుర్తి పట్టణ ముస్లిం మైనార్టీలుశుక్రవారం మసీదుల దగ్గర టెర్రరిస్టుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. కల్వకుర్తి ముస్లిం మైనార్టీలు మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదుల చేష్టలపైకదంతొక్కారు.భారతదేశాన్ని ఎవరు తమ నుండి వేరు చేయలేరని పాకిస్తాన్ ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపాలంటూ ఎలాంటి సందేహాలు అవసరం లేదని తామందరం భరతమాత బిడ్డలం అంటూ స్పష్టం చేశారు. భారతదేశ ఒక సెక్యూలర్ దేశమని ఇందులో ఎలాంటి సందేహం ఉండబోదని రాజకీయ నాయకులు పార్టీల స్వార్థం వీడి దేశ భద్రతకు దేశ ఔన్నత్యానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమయం వస్తే ముందుగా నిలబడేది ముస్లిం పౌరులేనని పాకిస్తాన్ అడ్డగోలు చేష్టలను చూస్తూ ఊరుకోమని భారతమాత బిడ్డలమే అందరం అంటూ నినదించారు.ఈ భారత దేశంలో సర్వ మతాలు ఉన్నాయని అందరం అన్న తమ్ముళ్ల వలె కలిసిమెలిసి ఉన్నామని టెర్రరిజం అనే భూతాన్ని పారద్రోలాలని పిలుపునిచ్చారు.

# ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ..




**జమ్మికుంట, ఏప్రిల్ 25( మన వార్త ప్రతినిధి):**ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలలో శుక్రవారం వైద్య సిబ్బంది ప్రపంచ మలేరియా దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వావిలాల గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో వైద్యాధికారి డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ ప్రపంచ మలేరియా ఇది దాదాపు 10 నుండి 14 రోజులు పడుతుందని,జ్వరం, చలిగా ఉండటం, వాంతులు, వికారం, ఒంటినొప్పులు, తలనొప్పి, దగ్గు మరియు డయేరియా వంటివి మలేరియా వ్యాధిలో కనిపించే కొన్ని మలేరియా లక్షణాలు అని చెప్పారు.ఈ వ్యాధి వలన ఎర్ర రక్తకణాలు క్షీణించి, రక్తహీనత కు దారితీస్తుంది. మెదడులో రక్త నాళాల విచ్ఛిత్తి కలిగి, కాలేయంపై కూడా ప్రభావం చూపుతదని తెలిపారు.దోమ తెర ఉపయోగించాలి,దోమలను చంపడానికి ఇంట్లో దోమల మందు కొట్టాలి,వీల్కైతే తలుపులు, కిటికీలకు దోమలు రాకుండా ఆపే నెట్ లు బిగించాలి,దోమలు వచ్చి నిలవకుండా ఉండేందుకు ఫ్యాన్లు, ఎ.సి.లు ఉపయోగించాలి.లేత రంగులో ఉండి, శరీరాన్ని మొత్తం కప్పే బట్టలు వేసుకోవాలి.దోమలు కొన్ని చెట్లు, పొదల దగ్గరగా గుంపులుగా ఉంటాయి. వీల్కైతే, అలాంటి చోట్లకు వెళ్లకూడదు,నీళ్లు ఎక్కడా నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఎందుకంటే దోమలు అక్కడ గుడ్లు పెడతాయని పలు జాగ్రత్తలు,నివారణ చర్యలను సూచించారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య ఉప కేంద్రాల వైద్యులు డాక్టర్ చందన, డాక్టర్ హిమబిందు, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ సంధ్య, డాక్టర్ ఫర్హానుద్దీన్, డాక్టర్ కార్తీక్, డాక్టర్ విజయ్ , సూపర్వైజర్స్ రత్నకుమారి, అరుణ, కుసుమ కుమారి, సదానందం,హెల్త్ అసిస్టెంట్ నరేందర్ మరియు ఆరోగ్యశాఖ సిబ్బంది ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

# విశిష్ట అధికారాలున్న వక్ఫ్ బోర్డు నిర్ణయాలే సుప్రీమ్ – బీజెపి పార్టీ మండల అధ్యక్షులు ర్యాకం శ్రీనివాస్



**కమలాపూర్ ఏప్రిల్ 24(మన వార్త ప్రతినిధి ఏలిమి రాజు)** కమలాపూర్ లో నిర్వహించిన విలేకరుల సమావేశం లో భారతీయ జనతా పార్టీ కమలాపూర్ మండల అధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్ మాట్లాడుతూ పేదల భూములు కొంతమంది పెత్తందారుల చేతిలో ఉండి వక్ఫ్ పేరిట పేద అమాయకమైన ముస్లింలను ముస్లిమేతరుల ను ఇబ్బంది పెడుతున్న క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ చట్టానికి సవరణ అవసరమని దేవుడు పేరిట ఇచ్చే భూములను వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పేదలకు పంచాలని, కనీసం సామాన్యుడు తమ బాధలను కోర్టుకు చెప్పుకోలేని పరిస్థితి నుంచి ఈరోజు ఈ చట్ట సవరణ ద్వారా తమ బాధను కోర్టుకు విన్నవించుకునేలా ఈ చట్టాన్ని రూపొందించడం ఆనందదాయకంగా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ భూపతి ప్రవీణ్, తుమ్మ శోభన్ బాబు, బండి కోటేశ్వర్, మోకిడ ప్రసాద్, కనుకుంట్ల అరవింద్, ఇనుగాల రత్నాకర్, పెండ్యాల ప్రభాకర్ రెడ్డి, పెండ్యాల తిరుపతిరెడ్డి, చిట్టి సుందరయ్య,మేడిపల్లి రాజు, పూస్కురి రాంబాబు,చెరి పెల్లి రతన్, వాసాల సత్తయ్య, ఎగ్గోజు శ్రీనివాస్, అకినపల్లి రవీందర్, శనిగరం సంపత్, మౌటం అశోక్,%జీ% అశోక్, మార్గం చైతన్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆదివాసీలపై మారణ హెూమాలు సృష్టించవద్దు




**-అడవులు ఖనిజ సంపదను కాపాడుకోవాలి...**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 25 మన వార్త ప్రతినిధి**

అడవులను,అటవీ ఖనిజ సంపదలను బడా కార్పోరేట్ శక్తులకు కట్టబెట్టడానికిఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మధ్య భారతంలో ఆదివాసీలపై భౌతిక దాడులను మరణ హెూమాలను సృష్టిస్తున్నాయి అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొక్కల భాస్కర్,ఆలిండియా కేత్ మజ్దూర్ కిసాన్ సభ ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు ప్రసాదన్న, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కే విశ్వనాథ్ సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ,సిపిఐ ఎంఎల్, అనుబంధం విప్లవ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అఖిలభారత రైతుకూలీ సంఘం ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బానోతు ఊక్లా, గోదావరిలోయ బొగ్గగని కార్మిక యూనియన్ జి ఎల్ బి కే యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందగట్ల సురేందర్ ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు నున్న కృష్ణ,ఆలిడియా కేత్ మజ్దూర్ కిసాన్ సభ ఏ కే ఐ కే ఎం ఎస్ రాష్ట్ర నాయకులు బొర్ర ఆనంద్, బండ్ల వెంకటేశ్వర్లు పొన్నం చందర్ అధ్యక్షతన జిల్లా కేంద్రం లో సదస్సు నిర్వహించడం జరిగింది.ప్రారంభఉపన్యాసం:ఇల్లందు మాజీ ఎమ్మెల్యేగుమ్మడి నరసయ్య సిపిఐఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు చేశారు.ఈ సదస్సుకు ముఖ్య వక్తలుగా అఖిల భారత రైతు కూలీ సంఘం ఏకే ఐఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొక్కల భాస్కర్,ఆలి%యా%డియా కేత్ మజ్దూర్ కిసాన్ సభ ఏ కే ఐ ఎం ఎస్ రాష్ట్ర నాయకులు ప్రసాద్,సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె విశ్వనాథ్ ముఖ్య వక్తలుగా పాల్గొని ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై జరుపుతున్న హత్యాకాండ,భౌతిక దాడులు ఆపాలని ఆదివాసీలపై జరుగుతున్న హత్యాకాండ ను తక్షణమే నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో ముఖ్యంగా మధ్యభారతంలో ఆదివాసులపై కేంద్ర ప్రభుత్వం దాడులు హత్యాకాండలను జరుపుతూ, నిత్యం నరమేధం సృష్టిస్తూ, రక్తాన్ని ఏరులై పారుస్తున్నదని. అడవుల్లో ఉన్నటువంటి సహజ అటవీ, ఖనిజ సంపదను బిజెపి ప్రభుత్వం బడా కార్పొరేట్లు ఆదాని అంబానీలకు దోచిపెట్టడం కోసం ఆదివాసులను హతమారుస్తున్నారని పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరుపై ధ్వజమెత్తారు. నాడుబ్రిటిష్ సామ్రాజ్య వాదులు అటవీ సహజ సంపదను బంగారం వజ్రాలు వగైరా సంపదను కొల్లగొట్టుకొని పోతే,ఈనాటి బీజేపీ ప్రభుత్వం వారి అభిమానులైన అంబానీ,ఆదాని అయిన బడా కార్పొరేట్లకు ఈ సంపదను దోచిపెడుతున్నది. ఎదురుతిరిగిన అమాయక ఆదివాసి గిరిజనులను నిత్యం ఎన్కౌంటర్ల పేరుతో చంపి వేస్తూ, వారిని నక్సలైట్లుగా ముద్ర వేస్తూ, ప్రశ్నించిన వారిని కూడా జైల్లో నింపుతూ బేస్ క్యాంపులలో కూడా బందీలుగా నిర్బంధిస్తూ, ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసి జాతిహననానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాల్పడుతున్నాయన్నారు. క్రూరమైన హత్యాకాండ కు తెగబడుతున్నాయి. ఆదివాసీలు జెల్, జంగల్, జమీన్ కోసం ఉద్యమిస్తున్నారని.మావోయిస్టులపై జరుపుతున్న కాల్పులను తక్షణమే విరమించుకోవాలి.మావోయిస్టులతో తక్షణమే చర్చలు జరపాలి.ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సాంబ, గణేష్ నాయకులు వీరమల్ల ఉమ,గుగులోతు రాచందర్ నెల్లూరి నాగేశ్వరరావు సనప పొమ్మన్న సాయిలు మల్లన్న భూక్య శివ లావణ్య గుర్రం వెంకట్ మధు కోరం వెంకటేశ్వర్లు ఎల్ రవి అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కార్యక్రమాలతో అమరవీరుల గానాలని పాడి సభని ఆకట్టుకున్నాయి.

# తెలంగాణ ప్రజా ఫ్రంట్ 4వ జిల్లా కమిటీ సమావేశం



**జమ్మికుంట, ఏప్రిల్ 25( మన వార్త ప్రతినిధి):**

కరీంనగర్ జిల్లా తెలంగాణ ప్రజా ఫ్రంట్ 4వ జిల్లా కమిటీ సమావేశాలు పట్టణంలోని విన్ డమ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ కమిటీ సమావేశానికి రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, రాష్ట్ర కో కన్వీనర్ గొల్లూరు ప్రవీణ్ కుమార్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం మాట్లాడుతూ ప్రజాస్వామ్య తెలంగాణ (టీపీఎఫ్) ప్రధాన లక్ష్యం అని అన్నారు. కరీంనగర్ జిల్లాలోని కనిజ సంపదను ఖరీదైన గుట్టల విధ్వంసం యదేచ్చగా జరుగుతుంది. బహిరంగంగా జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోక పోవడం చాలా బాధాకరం అని అన్నారు. ఈ విధ్వంసాన్ని తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకొని ఆపివేయాలి ఇసుక క్వారీలను తక్షణమే ఆపివేయాలి డిమాండ్ చేశారు.ఆపరేషన్ కు వ్యతిరేకంగా ఆదివాసీలపై జరుగుతున్న హత్యలను అమాయకులైన ఆదివాసులను హత్యలు చేయడం కేంద్ర, రాష్ట్ర పారా మిల్ట్రీ డి.ఆర్.జి బలగాలను నిలిపివేయాలని తదితరు లక్షలాది మిలిటరీ బలగాలను వెంటనే వెనక్కి రప్పించాలని బోగస్ ఎన్కౌంటర్లను తక్షణమే ఆపివేయాలి భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి రాజ్యాంగాన్ని కాపాడాలని,ఆదివాసుల హక్కుల మరణాన్ని వెంటనే ఆపేయాలని మావోయిస్టులతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి హాజరైన వివిధ ప్రజా సంఘాల నాయకులు తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి కొత్తూరు ఇంద్రసేన, పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి గడ్డం సంజీవ్, వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి పాపన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో కరీంనగర్ జిల్లా (టీ పి ఎఫ్) నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆరెల్లి మల్ల గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఆయిందాల అంజన్న, ఉపాధ్యక్షులుగా అలుగువెల్లి మల్లారెడ్డి, కార్యవర్గ సభ్యులు గా చేరాలు, సహాయ కార్యదర్శి చుక్కల శ్రీనివాస్ దేవునూరి రవి లను ఎన్నుకున్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత అల్పాహారం పంపిణీ



**గజ్వేల్ ఏప్రిల్ 25 (మన వార్త ప్రతినిధి జీ మురళి)**
సిద్దిపేట జిల్లా ప్రభుత్వ దవాఖాన వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అల్పాహార పంపిణీ శుక్రవారం 4 వ సంవత్సరం 299 వ రోజుకు చేరుకుంది ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ రీజియన్ ఫాస్ట్ చైర్మన్ గుడాల రాధాకృష్ణ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో ప్రభుత్వ దవాఖానాలో రోగులకు వారి బంధువులకు ఉచిత అల్పాహారం పంపిణీ చేస్తున్న విషయాన్ని గుర్తించి స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఉద్యోగి అశ్విన్ కవిత దంపతులు వారి పెళ్లిరోజు సందర్భంగా అల్పాహార పంపిణీ ఈరోజు నుండి 15 రోజుల వరకు అందజేయడం జరుగుతుందని వారికి పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రత్యేక అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు మల్లేశం గౌడ్,లయన్ పరమేశ్వర చారి, దొంతుల సత్యనారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

### లైన్స్ క్లబ్ బంజర హిల్స్ సౌజన్యంతో పాండురంగారావు నగర్ పార్కు వద్ద "ఐ"

## విజన్ సెంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**కూకట్పల్లి ఏప్రిల్ 25 మనవార్త ప్రతినిధి**
శుక్రవారం మోతీ నగర్ లోని లైన్స్ క్లబ్ బంజారాహిల్స్ సౌజన్యంతో పాండురంగారావు నగర్ మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ కంటి సమస్యలు ఉన్నవారు ఎవరైనా ఈ శిబిరం వద్ద పరీక్షలు నిర్వహించుకోవచ్చు అని .అన్ని ఏర్పాట్లు చేసిన లైన్స్ క్లబ్ బంజారాహిల్స్ సభ్యులను అలాగే సాధురం ఆస్పటల్ సిబ్బందిని అభినందించారు.. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ సభ్యులు మరియు సాధురం ఆస్పటల్ సిబ్బంది మాట్లాడుతూ ఈ కంటి శిబిరం మోతీ నగర్ పాండురంగారావు నగర్ పార్కు వద్ద ప్రతినెల 2 మరియు 4 వ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తామని ..ఎవరైనా కంటి సమస్యలు ఉన్న ఎడల ఇక్కడ పరీక్షలు చేయించుకోవచ్చు అని.. అలాగే సమస్య ఉన్నవారికి ఉచితంగా మందులు, ఆపరేషన్లు కూడా తామే చేయిస్తామని తెలిపారు.. ఈ కార్యక్రమంలో మాజీ మల్టిపుల్ చైర్ పర్సన్ ప్రేమ్ కుమార్, సాధురం హాస్పటల్ చైర్మన్ హరీష్ సహాని, సెక్రటరీ కిషోర్ చాపియా, లైన్స్ క్లబ్ మెంబర్లు.. టీవీ. సుబ్బారావు, నాగరాజు, సత్యనారాయణ మరియు ఇతర సిబ్బంది కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పూరీ తీరాన సైకత శిల్పం ఏర్పాటు చేయించిన రవీందర్ యాదవ్




**శేరిలింగంపల్లి ఏప్రిల్ 25 (మన వార్త ప్రతినిధి)**
పర్యాటకులను ఆకట్టుకుంటున్న సైకత శిల్పం అందులో సభ, 25 ఏళ్ల ప్రస్థానం వివరాలు
దగ్గరుండి సైకత చిత్రాన్ని గీయించిన రవీందర్ యాదవ్ ఇంటికి ఒక్కరు గులాబీ సైన్యంలా కదలాలి తెలంగాణ సత్తా చాటాలి అని పిలుపు రజతోత్సవ సభ సందర్భంగా ఏర్పాటుభారాస రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ శేరిలింగంపల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత రవీందర్ యాదవ్ సైకత శిల్పాన్ని ఏర్పాటు చేయించారు. ఒడిశాలోని పూరీ సముద్ర తీరం చెంత ఛలో వరంగల్ సభకు సంబంధించిన వివరాలను సైకత శిల్పంలో పేర్కొన్నారు. సైకత శిల్పంలో తెలంగాణ మ్యాప్ తో పాటుగా అందులో కేసీఆర్ చిత్రాన్ని, 25 ఏళ్ల ప్రస్థానంకు సంబంధించి కేసీఆర్ నాయకత్వంలో చేసిన సర్వీస్, కమిట్ మెంట్, తెలంగాణ ప్రోగ్రెస్ ను తెలుపుతూ అందులో పేర్కొన్నారు. పార్టీ ఏర్పాటు జరిగి 25 ఏళ్ల సందర్భంగా నిర్వహిస్తున్న సభకు పెద్ద ఎత్తున ప్రతి ఒక్కరు తరలి రావాలని చెబుతూ రవీందర్ యాదవ్ ఈ సైకత శిల్పాని పూరీ తీరాన గీయించినట్లుగా ఆయన తెలిపారు. ఏప్రిల్ 27న ఎల్కతుర్తి వద్ద భారాస నిర్వహించే సభ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. చరిత్రలో నిలిచే సభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని రవీందర్ యాదవ్ ప్రతి ఒక్కరిని కోరారు. భారాస అధినేత కేసీఆర్ మీద ఉన్న అభిమానంతో తాను పూరీ వెళ్లి సైకత శిల్పాన్ని ఏర్పాటు చేయించానని రవీందర్ యాదవ్ అన్నారు. ఇంటికి ఒకరు గులాబీ సైన్యంలా కదలాలి అని, తెలంగాణ సత్తా చాటాలని సూచించారు.

## ఎస్ .టి .పి ప్లాంట్ కు సంబంధించి పైప్లైన్ నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్



**కూకట్పల్లి ఏప్రిల్ 26 మన వార్త ప్రతినిధి**
శుక్రవారండి విజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఎస్ .టి .పి ప్లాంట్ కు సంబంధించి పైప్లైన్ నిర్మాణ పనులను డివిజన్లోని 7వ ఫేస్ మరియు ఇందు అపార్ట్మెంట్స్ పరిసర ప్రాంతాల్లో పనులు ఏ విధంగా జరుగుతున్నాయో పర్యవేక్షించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పనులు సత్వరమే పూర్తి చేయాలని అలాగే ఏదైనా ఇబ్బంది ఉన్న ఎడల తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో హెచ్. ఎం. డబ్ల్యూ. ఎస్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, వాటర్ వర్క్స్ సివిల్ కాంట్రాక్టర్స్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ సదయ్య ఏ ఎస్సై గా పదోన్నతి..



**జమ్మికుంట, ఏప్రిల్ 25( మన వార్త ప్రతినిధి):**
జమ్మికుంట పట్టణ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తున్న జి సదయ్య ఏ ఎస్సై గా పదోన్నతి పొందారు.పనిలో నిబద్ధత,అంకితభావం, సిన్సియారిటి నీ గుర్తించి సదయ్య కు పదోన్నతి కల్పించారు. జమ్మికుంట సిఐ వరంగంటి రవి సదయ్య ను అభినందించారు.

## కెసిఆర్ ను మళ్ళీ సీఎం చేసే వరకు అలుపెరగని పోరాటం చేస్తా.మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్




**కల్వకుర్తి.మార్చి 25. మన వార్త ప్రతినిధి**
**-సభకు భారీగా తరలి రావాలని ఇంటి ఇంటికి తిరిగి బొట్టు పెట్టి ఆహ్వానించిన మహిళలు..**
ఈనెల 27న వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో నిర్వహించబోతున్న బీఆర్ఎస్ 25వ రజతోత్సవ సభకు కడ్తాల్ మాజీ జెడ్పిటిసి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ ఆధ్వర్యంలో కడ్తాల్ గిరిజన మహిళలు కదం తొక్కారు. కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండలంలో పోచమ్మ గడ్డ గ్రామపంచాయతీ నుండి ఇంటింటికి తిరిగి గడపగడపకు బొట్టు పెట్టి ప్రతి మహిళ సభకు హాజరుకావాలనిఆహ్వానించారు.వరంగల్ సభకు కల్వకుర్తి నియోజకవర్గంలోని 212 తాండాల నుండి ప్రతి గిరిజన సోదర సోదరీమణులు భారీ సంఖ్యలో తరలిరావాలని ప్రతిజ్ఞ చేశారు.మళ్లీ కెసిఆర్ ను సీఎం చేసేంతవరకు తమ పట్టును విడబోమని గుర్తు చేశారు.తెలంగాణరాకముందు తాండాలకు గుర్తింపు ఉండేది కాదని, కనీసం గుక్కెడు మంచినీళ్లు తాగుదామన్నా కూడా దొరకని పరిస్థితి ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు.కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షతో తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత గిరిజనులకు ప్రత్యేక గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసి, మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి మంచినీరు అందించిన ఘనత కేసిఆర్ కు దక్కుతుందని అన్నారు. అంతేకాకుండా ఆరు శాతం ఉన్న రిజర్వేషన్లను 10% పెంచి అన్ని రకాలుగా ప్రోత్సహించిన కేసీఆర్ మళ్ళీ అధికారంలోకి వచ్చేంతవరకు తమ పోరాటం ఆగదని సూచించారు.దానితోపాటు తమ ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించేలా చేసిన ఘనుడు కేసీఆర్ అని సూచించారు.ప్రస్తుత కాంగ్రెస్ పాలన చూస్తుంటే గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రజలు ఎలాంటి ఇబ్బందులనుఎదుర్కొన్నామో రేవంత్ సర్కార్ మళ్లీ ఇప్పుడు ఆ పరిస్థితులను పునరావృతం చేస్తుందని సూచించారు. అడుగులు అడుగేస్తూ అందరిని కలుపుకుంటూ కదం కదం తొక్కి తెలంగాణ రాష్ట్ర ప్రధాన ప్రియతమ నాయకుడు కెసిఆర్ ని మళ్లీ సీఎం చేసేంతవరకు అలుపెరగని పోరాటం చేస్తామని సూచించారు.

## పహల్గంలో ముష్కరుల దాడిని ఖండించిన ముస్లిం మైనార్టీలు



**-మండల ముస్లిం మైనారిటీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ...**
**జమ్మికుంట, ఏప్రిల్ 25( మన వార్త ప్రతినిధి):**
కాశ్మీర్లోని పహల్గంలో పర్యటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ జమ్మికుంట మండల మైనారిటీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం నల్ల బ్యాడ్జీలతో నిరసన ర్యాలీ చేపట్టారు.అనంతరం వారు మాట్లాడుతూ ఉగ్రవాదానికి మతోన్మాదమే తప్ప మతాలతో సంబంధం ఉండదని అలాంటి వారికి తగిన గుణపాఠం చెప్పడానికి ప్రతి ఒక్క భారతీయుడు సిద్ధంగా ఉన్నాడని చెప్పారు.విభిన్న మత సంస్కృతులకు నిలయము మన దేశానికే గర్వకారణం అయినా జమ్మూ కాశ్మీర్లో గతంలో ఉన్న విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370 నీ రద్దు పరుస్తూ జమ్మూ కాశ్మీర్ ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిన నేపథ్యంలో ఉగ్రవాద మూలాలు లేని జమ్మూ కాశ్మీర్లో ప్రజలు పర్యాటకులు సురక్షితంగా ఉన్నారు. యావత్తు దేశం సంతోషించే ఈతరుణంలో గతంలో పుల్వామ ఘటన కంటే దారుణమైన రీతిలో పహల్గాం ఘటన జరగడం చాలా బాధాకరం అన్నారు.ఈ ఘటన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను స్వాగతిస్తూ దేశ భద్రత విషయంలో ఏర్పడుతున్న వైఫల్యాలను ఎదుర్కునేందుకు రక్షణ రంగం విషయంలో మరింత బాధ్యతతో వ్యవహరిస్తూ ఇకముందు ఇలాంటి సంఘటనలు జరగకుండా ఇందులో వైఫల్యం చెందిన ఆయా విభాగాలకు చెందిన అధికారులపై శాఖపరమైన చర్యలు చేపడుతూ ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టి దాయాది దేశమైన పాకిస్థాన్ కు ధీటైనా సమాధానం ఇవ్వాలని ఇందుకు దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిపక్షాలు సైతం కలుపుకొని ముందుకూ సాగాలని డిమాండ్ చేశారు.ఇదేవిధంగా ముష్కరులను, తీవ్రవాదులను, ఉగ్రవాదులను జిహాదీలుగా పేర్కొనడం భావ్యం కాదు అన్నారు. ఇలాంటి వారికి ఇస్లాంకు ఎలాంటి సంబంధం లేదు అని ఇస్లాంను ప్రపంచవ్యాప్తంగా అగౌరపరిచే ఇలాంటి దుష్ట శక్తుల చర్యలను యావత్తు ముస్లిం సమాజం ఖండిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండలం ముస్లిం ఐక్యవేదిక నాయకులు మౌలానా నజీర్, మహమ్మద్ జాకీర్, షేక్ సాబిర్ అలీ, డాక్టర్ ఫెరోజ్, సర్వర్ పాషా, ఫయాజ్, ఖాదర్, సుఫియాన్, సల్మాన్, సజ్జాద్, సాదిక్, ఆమీర్, షేక్ అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి చట్టం రైతులకు ఎంతో మేలు..



**-కలెక్టర్ పమేలా సత్పతి..**
**జమ్మికుంట, ఏప్రిల్ 25( మన వార్త ప్రతినిధి):**
ధరణి ద్వారా చాలా మంది రైతులకు నష్టం జరిగిందని, అలాంటి తప్పు జరగవద్దనే భూ భారతి చట్టం వచ్చిందని భూ భారతి చట్టంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జమ్మికుంట పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ శాఖ అధ్వర్యంలో తహసిల్దార్ రమేష్ కొత్త ఆర్ఓఆర్ చట్టం భూ భారతి పై రైతులకు అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు.ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు భూభారతిపై ఉన్న అనుమానాలను నివృత్తి చేశారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భూమి అంటేనే ఆత్మగౌరవమని, అలాంటి భూమి వివాదాల్లో ఉండడం తదితర అంశాల పరిష్కారానికి ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు. ధరణి పేరు మీద సమస్య ఉందని రైతులు పిటిషన్ పెట్టుకున్నారని, ఆ సమస్యల పరిష్కారానికి రికార్డులు ఉండేలా భూ భారతి పరిష్కార మార్గంగా ఉంటుందన్నారు. ధరణి పోర్టల్ లో జరగని పరిష్కారాలు దీనితో లభిస్తుంది అని తెలిపారు.30 సంవత్సరాల క్రితం అమ్మిన భూమి ధరణి లో మళ్ళీ పాత యజమాని పేరు వచ్చిందని, అందువల్లే పంచాయితీ లు గొడవలు అయ్యాయన్నారు. ప్రభుత్వం అందరికీ అనుకూలంగా ఉండే భూ భారతి తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహిస్తుందని, భూమి బదలాయింపు పారదర్శకంగా ఉండేలా చట్టం తెచ్చారని చెప్పారు. గతంలో తహసిల్దార్ పరిష్కరించే చిన్న చిన్న సమస్యలు సైతం కలెక్టర్ దృష్టికి వచ్చేవని వేల సంఖ్యలో దరఖాస్తులు రావడంతో పరిష్కారంలో జాప్యం జరిగేదన్నారు. ఈ నూతన చట్టంలో కింది స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించామన్నారు.భూ భారతిలో దరఖాస్తుల ప్రక్రియ చాలా సులభంగా ఉంటుందన్నారు.రైతులు అధైర్య పడకండి మీరు దరఖాస్తు చేసుకున్న భూమి సమస్యలను పరిశీలించి పారదర్శకంగా పరిష్కారం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ డీ ఓ రమేష్ బాబు,తహసిల్దార్ రమేష్, ఎం పిడీఓ భీమేష్,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ స్వప్నా సదానందం,పలువురు డైరెక్టర్లు,రెవెన్యూ సిబ్బంది, పలు శాఖల అధికారులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చేగుంట మండల కేంద్రంలో పోషన పక్షం

**(మన వార్తా ప్రతినిధి నరేందర్) ఏప్రిల్ 25**
చేగుంట మండల కేంద్రంలో శుక్రవారం బేటి బచావో బేటి పడావో, కార్యక్రమాన్ని, చేగుంట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో, ఐ సి డి ఎస్, సూపర్వైజర్ శైనిసువర్ణ, ఆధ్వర్యంలో, నిర్వహించారు ఈ కార్యక్రమానిక ముఖ్య అతిథిగా రామయంపేట సిడిపిఓ స్వరూప హాజరయ్యారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు అనంతరం, సీడిపిఓ స్వరూప మాట్లాడుతూ, అంగన్వాడి కేంద్రాలలో, పోషక ఆహారంలో ఎన్నో ఉపయోగకరమైన పోషక పదార్థాలు ఉంటాయి అన్నారు ముఖ్యంగా గర్భిణీలు మరియు బాలింతలకు పిల్లలకు ఎంతగానో బలాన్ని చేకూరుస్తుందనీ, గర్భిణీలకు పోస్టిక ఆహారం తీసుకోవడం వలన రక్తహీనత ను తగ్గించవచ్చున్నారు ముఖ్యంగా 18 సంవత్సరాలు నిండకుండానే బాలికలకు బాల్య వివాహాలు చేయడం నేరం అని అలానే స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలు జరగకుండా చూడాలన్నారు పురుషులతో సమానంగా స్త్రీలను కూడా చూడాలనీ స్త్రీ లేకపోతే సృష్టికి మూలమే లేదని అన్నారు మాతృత్వం, సంరక్షణ మరియు సృజనాత్మకత యొక్క ప్రతికలు స్త్రీ వివిధ రంగాల్లో తన ప్రతిభను చాటుకుంటున్నారన్నారు, అది విద్య, వైద్యం, సాహిత్యం, కళ, లేదా రాజకీయాలు అయిన, స్త్రీలు తమ హక్కులను తాను , అన్ని రంగాలలో పురుషులతో సమానంగా వారు అన్ని రంగాలలో ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు కాబట్టి, స్త్రీలను చిన్నచూపు చూడకూడదు,అని వారు కోరారు, ఈ కార్యక్రమంలో, ఐసిడిఎస్ అంగన్వాడి, సూపర్వైజర్ శైని సువర్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్స్, వివిధ గ్రామాల అంగన్ వాడీ టీచర్స్, చేగుంట మండల్ ఎమ్మార్వో శ్రీకాంత్, ఎంపీడీవో చిన్నారెడ్డి, హెల్త్ డిపార్ట్మెంట్, సిహెచ్ఓ, సంపతి, జిఎంఆర్ ఫౌండేషన్ శ్రీనివాస్, సంఘ సేవకులు అయిత పరజ్యోతి, వ్యవసాయ అధికారి హరిప్రసాద్, వివిధ ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.